పరిసరాలల పరిశుభ్రత అందరి బాధ్యత

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతాహీ కార్యక్రమాలు

అవనిగడ్డ: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని చెప్పారు. అవనిగడ్డ, పెడన, మచిలీపట్నంలో స్వచ్ఛతాహీ కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. అవనిగడ్డ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతాహీ కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థి దశ నుంచే పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వెంట రహదారులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొక్కిలగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ శైలజా కుమారి, ఈఓ తోట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధుల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానంగా మెయిన్ రోడ్లు, శాంతి థియేటర్ సెంటర్, మర్రిపాలెం వంతెన సెంటర్లలో చెత్త తొలగించారు.

మోపిదేవిలో..

మోపిదేవి: మండలంలోని మోపిదేవి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ముళ్లకంప, పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. విద్యార్థులను ఎంఈఓ విద్యాసాగర్ అభినందించారు.



అవనిగడ్డలో స్వచ్ఛతాహీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

డివిజన్లలో స్వచ్ఛతాహీ సేవ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా డివిజన్లలోని కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయా ప్రాంతాల్లో చెత్తను తొలగించి చీపుర్లతో ఊడ్చి పరిసరాలను శుభ్రం చేశారు. 38వ డివిజన్ గొడుగుపేటలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి ఆధ్వర్యంలో జరిగింది. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీకాకోళపు నరసింహ గుప్తా, వైఎస్సార్ సీపీ నాయకులు యెండూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. 29వ డివిజన్‌లో కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు.

పెడనలో..

పెడన: పెడన పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతాహీ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఎస్. పోతురాజు సిబ్బందితో కలిసి స్టేషన్ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్లు ఆర్‌పీ మీనా, ప్రజాపతి, సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, రైల్వే బుకింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు సచివాలయ ఉద్యోగులతో కలిసి స్వచ్ఛతాహీ కార్యక్రమాలు నిర్వహించారు.

గూడూరు: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గూడూరులో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గూడూరు హైస్కూల్ రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, ఎంపీపీ ఎస్. మధుసూదనరావు, జెడ్పీటీసీ సురేష్ రంగబాబు, సర్పంచ్ లింగం సులోచనారాణి, రైల్వే బోర్డు సభ్యుడు ఎం. రత్నారావులు స్థానికులతో కలిసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

బందరు మండలంలో..

కోనేరుసెంటర్: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతాహీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్ల వెంబడి ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. గృహాల మధ్య పేరుకుపోయిన మురుగునీరు, కచ్చా డ్రెయిన్ల ద్వారా పారుదల అయ్యేలా పనులు చేశారు. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. ఎస్ఎన్ గొల్లపాలెంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచి మట్టా మోహన్ నాంచారయ్య పాల్గొన్నారు. పెదపట్నంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గడిదేసి అనూష, గ్రామ ఇన్‌చార్జి రాజు తదితరులు పాల్గొన్నారు. పోతేపల్లి జ్యూవెలరీ పార్కులో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి అంకెం జితేంద్ర, ఇతర యూనియన్ నాయకులు పాల్గొని జ్యూవెలరీ పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎత్తివేయడంతో పాటు ముళ్లపొదలు, ఏపుగా పెరిగిన చెట్లను తొలగించారు.


నాగాయలంకలో చెత్త తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

చల్లపల్లి: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంతో గ్రామాల పరిశుభ్రత సాధ్యమని స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, వలంటీర్లు, స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు, బస్టాండ్ ప్రాంగణం, గార్డెన్, ప్రధాన రహదారిలో శ్రమదానం చేసి పిచ్చిమొక్కలు, చెత్త తొలగించారు. పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కలతోటి సుధాకర్, పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోడూరు: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం ఆదివారం కోడూరు పంచాయతీ పరిధిలో నిర్వహించారు. పాత గ్రంథాలయం వెనుక భాగంలో పెరిగిన ముళ్లకంప, నిల్వ ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. రహదారులను శుభ్రం చేశారు. ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. సర్పంచి వెన్నా షైనీ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


మోపిదేవిలోని ఆశ్రమ పాఠశాలలో చెత్త తొలగిస్తున్న విద్యార్థులు


బందరు 38వ డివిజన్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం


పోతేపల్లి జ్యూవెలరీ పార్కులో ముళ్లపొదలను తొలగిస్తున్న అసోసియేషన్ నాయకులు


కోడూరులో రహదారులను శుభ్రం చేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచి, అధికారులు

క్లుప్తంగా

సీఎం జగన్, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి జోగి రమేష్ చిత్రపటాలకు బేడ, బుడగ జంగాల సంఘాల సభ్యులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. పట్టణ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా బేడ, బుడగ జంగాల నాయకులు మాట్లాడుతూ చట్టసభలో తమను ఎస్సీలుగా గుర్తిస్తూ తీర్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి జోగి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కె. నాగకుమారి, వైస్ చైర్మన్ జె. చిన్నారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

15 నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ వేదమూర్తులైన గుండేపూడి నాగరాజశేఖర వర్మ ఆదివారం మాట్లాడుతూ 9 రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకారాలలో దర్శనమిస్తారని చెప్పారు. 15వ తేదీన అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారన్నారు. 16న గాయత్రీదేవిగా, 17న అన్నపూర్ణాదేవిగా, 18న లలితా త్రిపుర సుందరీదేవిగా, 19న రాజరాజేశ్వరీదేవిగా, 20న సరస్వతీదేవిగా, 21న మహాలక్ష్మీదేవిగా, 22న దుర్గాదేవిగా, 23న మహిషాసుర మర్దనీదేవిగా, 24న భ్రమరాంబికా దేవిగా దర్శనమిస్తారని వివరించారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం



నాగాయలంక: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. మండల విస్తరణ అధికారి కె.అప్పల నరసమ్మ ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులలో సీనియర్ సిటిజన్స్ కత్తి మల్లేశ్వరరావు, లక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. గ్రామ కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి శరీర దానం


సాంబశివరావు (ఫైల్)

చల్లపల్లి: స్థానిక పెద్దకళ్లేపల్లి రోడ్డుకు చెందిన కోనేరు సాంబశివరావు (95) ఆదివారం మృతి చెందారు. సాంబశివరావు కోరిక మేరకు ఆయన భౌతికకాయాన్ని బోధన ఆస్పత్రికి దానం చేసేందుకు ఆయన భార్య సీతామహాలక్ష్మి, కుమారుడు కోనేరు సత్య సాయికుమార్ ముందుకు వచ్చారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ మద్దివట్ల జగన్మోహనరావు ఈ సమాచారాన్ని నాగాయలంక సుదర్శి మానవతా సేవా సంస్థ వారికి అందజేశారు. సంస్థ ప్రతినిధులు తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ చల్లపల్లి చేరుకుని ఏలూరు ఆశ్రం బోధన ఆస్పత్రి వారికి సాంబశివరావు భౌతిక కాయాన్ని అప్పగించారు. నేత్రాలను విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. సుదర్శి సంస్థ చొరవతో ఐదవ శరీరదానం, 186వ నేత్రదానం జరిగినట్లు రఘుశేఖర్ తెలిపారు.

గుర్రం జాషువాకు నివాళి

గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకుడు పేర్లి దాసుకు కవి కోకిల గుర్రం జాషువా స్ఫూర్తి సాహితీ పురస్కారం - 2023 అందజేశారు. కోగంటి గాంధీ, గ్రంథాలయ అధికారి బీరం వెంకటరమణ, అబ్దుల్ గఫార్, బండి గోవర్ధనరావు, లంకపల్లి లాజరు, శుభాకరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ, కె. కొత్తపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదివారం పరామర్శించారు. కె. కొత్తపాలెంలో గ్రామ పార్టీ కన్వీనర్ మత్తి వెంకట రాజాచంద్ ఇటీవల గుండె పోటుతో స్టంట్ వేయించుకున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రాజాచంద్‌ను పరామర్శించారు. కొక్కిలిగడ్డలో పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు రాయన మాధవరావు అనారోగ్యానికి గురికావడంతో ఇంటి వద్ద ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పీఏసీఎస్ చైర్పర్సన్ తుటారం కృష్ణ, పార్టీ గ్రామ కన్వీనర్ రాయన సత్యనారాయణ, మత్తి రాంప్రసాద్, అనిశెట్టి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి నేత్రదానం


వెంకట సుబ్బారావు (ఫైల్)

అవనిగడ్డ: స్థానిక రెండో వార్డుకు చెందిన చెన్నగిరి వెంకట సుబ్బారావు (70) గుండెపోటుతో మృతిచెందారు. మృతుడు గతంలోనే నేత్రదానం చేస్తానని ముందుగానే అంగీకార పత్రం తీసుకోవడంతో కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు సమాచారం అందించారు. వైద్య బృందం వచ్చి వెంకట సుబ్బారావు నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు.

179 మందికి వైద్యసేవలు

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేట జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 179 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జీవీఆర్ ఫౌండేషన్, ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ గోపాలం శివన్నారాయణ రోగులకు పరీక్షలు నిర్వహించారు. రోగులకు రెండు నెలలకు సరిపడా మందులను రూ.200లకే అందజేశామని శిబిరం కన్వీనర్ పామర్తి నాగయ్య తెలిపారు. వైద్యులు డీఆర్కే ప్రసాద్, పి. సురేష్ చంద్రారెడ్డి, కుప్పా రామశాస్త్రి వైద్యసేవలు అందించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

అద్దాడ(పామర్రు): గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలో గుంటూరు వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును మృతుడి కుటుంబానికి అందజేశారు. పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక పార్టీ నాయకులు పామర్తి వెంకటేష్ మృతుడి కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపిన జగనన్న

మంత్రి జోగి రమేష్

పెడన: ఆర్థిక అండలేని ప్రతి పేద కుటుంబంలో ఆనందాన్ని నింపడానికే సామాజిక పింఛన్ల సొమ్ములను పెంచి ఆదుకున్న గొప్ప మనసున్న మనిషి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. పట్టణ పరిధిలోని 8వ వార్డులో ఆదివారం ఆయన సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. గతంలో పింఛన్లు తీసుకునేందుకు లబ్ధిదారులు పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవారని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు ఝామునే పింఛన్లు అందజేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వార్డుల్లో తిరుగుతూ స్వయంగా తానే ఇంటి వద్ద పింఛన్లు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, వైస్ చైర్మన్ మహ్మద్ ఖాజా, వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండలంలోని చినపాండ్రాక, కృత్తివెన్ను గ్రామాల్లో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు జోగి రాజీవ్ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. రాజీవ్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. తొలుత ఆయన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని గ్రామాల్లో వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.


పెడన 8వ వార్డులో పింఛన్ అందజేస్తున్న మంత్రి జోగి రమేష్


చినపాండ్రాకలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న జోగి రాజీవ్

మచిలీపట్నానికి తృతీయ స్థానం..

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగర పాలక సంస్థ జిల్లాలో తృతీయ స్థానంలో నిలిచింది. ఆదివారం తెల్లవారు జాము నుంచే వలంటీర్లు పింఛనుదారుల ఇంటికి వెళ్లి పెన్షన్లను అందజేశారు. నగరంలో మొత్తం 19,123 మంది పింఛనుదారులు ఉండగా 16,189 మందికి పింఛన్లు పంపిణీ చేసి 84.66 శాతం సాధించారు. ఇంకా 2,934 మందికి పింఛన్లు అందజేస్తే నూరుశాతం పింఛన్ల పంపిణీ పూర్తవుతుంది.

గూడూరు: గూడూరులో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సురేష్ రంగబాబు స్థానిక నాయకులు, వలంటీర్లతో కలిసి వార్డుల్లో తిరుగుతూ పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగం సులోచనారాణి, రైల్వే బోర్డు సభ్యుడు ఎం. రత్నారావు, పీహెచ్‌సీ డైరెక్టర్లు బి. త్రినాథ్, ఎంఏ సలీం, సచివాలయ కన్వీనరు మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

ఘనంగా వనువులమ్మ తల్లి జాతర


వనువులమ్మ తల్లి జాతరలో మంత్రి జోగి రమేష్


వనువులమ్మ తల్లిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులు ఉప్పాల హారిక, రాము

కృత్తివెన్ను: మండల పరిధి సీతనపల్లి గ్రామంలో వనువులమ్మ తల్లి జాతర ఆదివారం మొక్కుబడులతో ఘనంగా జరిగింది. శుక్ర, శనివారాలు గ్రామంలో అమ్మవారికి భక్తులు పొన్పులు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామ ఆడపడుచులు, బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారిని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దంపతులు ఉప్పాల హారిక, రాము, మాజీ డెప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, టీడీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్, మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డ్రా స్కీమ్

గుడివాడటౌన్/కైకలూరు: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని గుడివాడ డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డ్రా ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ డి.రాజేష్ కుమార్, ఆర్టీసీ డిపో అధికారి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని గుడివాడ – బంటుమిల్లి, గుడివాడ – కైకలూరు రూట్‌లలో ప్రయాణికులకు ఈ లక్కీ డ్రా వర్తిస్తుందని వివరించారు.

ఘనంగా గణేశుని నిమజ్జనాలు

అన్నవరం(మోపిదేవి): మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాన్ని ఆదివారం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. 14 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుని గ్రామంలో తొలుత ఊరేగించారు. దారి పొడవునా మహిళలు హారతులిచ్చారు. అనంతరం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాల నిమజ్జన ఊరేగింపు ఆదివారం ఉత్సాహంగా జరిగింది. పందిళ్లలో ఉన్న గణనాథుని విగ్రహాలను వాహనాలపై ఉంచి నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా స్వామివారి వాహనం ముందు డీజే సౌండ్స్‌తో పాటు డప్పులు, తీన్‌మార్ డప్పుల వాయిద్యాల నడుమ యువత చిందులు వేస్తూ ముందుకు సాగారు. పలు పందిళ్ల వద్ద అన్నసమారాధన నిర్వహించారు. మూడో డివిజన్‌లో జరిగిన పలు అన్నసమారాధన కార్యక్రమాల్లో డెప్యూటీ మేయర్ శీలం భారతి పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు.


బందరు అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న డెప్యూటీ మేయర్ శీలం భారతి

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు శిక్షణ



భావదేవరపల్లి(నాగాయలంక): ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో స్థానిక ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం విద్యార్థులకు ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య భారతి ఏపీ అధ్యక్షుడు, అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్‌రావు శిక్షణ ఇచ్చారు. ఫిట్స్, పాముకాటు, గుండెపోటు, పక్షవాతం, సీపీఆర్, ఛాతీమర్దన తదితర అంశాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చికిత్స చర్యలను ఆయన వివరించారు. పీవీ కృష్ణారావు, ఆరోగ్య భారతి కార్యవర్గ సభ్యురాలు ఎన్‌టీ కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు. శిక్షణకు 50 మంది విద్యార్థులు, కళాశాల సిబ్బంది హాజరయ్యారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్యూలైన్లు అన్నీ నిండిపోయాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

పెడన: పాము కాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పల్లి పంచాయతీ శివారు ముచ్చర్లగుంట గ్రామానికి చెందిన నందమాల కృష్ణమూర్తి (54) ఆదివారం ఉదయం పొలం పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. బాధితుడిని కుటుంబ సభ్యులు మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుని కుమారుడు గణేష్‌బాబు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ టి. సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు.